ప్రేమపాశము

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

(అనువృత్తము)

నాలుగోఅంకం

మొదటిరంగం

[మధ్యాహ్నం మూడుగంటలవేళ. కాంతమ్మ యింటో వుత్తరపువసారాలో శేషయ్యా, పేరుభట్టూ కూచునివుంటారు.]

శేషయ్య—ఈమధ్య వీర్రాజుదగ్గిర నూట యాభైరూపాయలు పుచ్చుకున్నాట్ట నోటుమీద.

పేరుభట్టు—సంతకం నువ్వా చేశావా ?

శేషయ్య—అలాంటిమాటలు నాదగ్గిరా ?

పేరుభట్టు—వీర్రా జెలా యిచ్చాడూమరీ ?

శేషయ్య—ఏమో ?

పేరుభట్టు—రాఘవరాజుగారి నోటులో యేమేనా చెల్లుపెట్టాడా ?

శేషయ్య—దమ్మిడీకూడా యివ్వలేదు.

పేరుభట్టు—మొత్తం—

శేషయ్య—మూడువేలకిపైన.

పేరుభట్టు—సున్నకిసున్నా, హళ్లికిహళ్లీనీ.

శేషయ్య—ఏమనుకున్నావుమరి ?

పేరుభట్టు—ముందుసంగతి యేమిటి ?

శేషయ్య—వాడికీ, రుణదాతలికీ లంకె.

పేరుభట్టు—వాడికొక్కడికే ? వాళ్లెలా యిస్తున్నారూ, మైనారిటీవదిలిన మనం వుండగానూ ?

శేషయ్య—అనుభవిస్తారు. మనమేం చేస్తామూ ?

పేరుభట్టు—భవిష్యత్తు ?

శేషయ్య—నీవుద్దేశం యేమిటి ?

పేరుభట్టు—నావాటా వొదులుకుంటే ?

శేషయ్య—యకరంభూమి చేదా ?

పేరుభట్టు—పేచీలుపడాలి. తిరగాలి.

శేషయ్య—నేనున్నానుగాదూ ?

పేరుభట్టు—ఇక్కడ ప్లీడర్లతో ఆలోచిద్దాం. అవసరమైతే డబ్బు పుచ్చుకోకుండా వ్యవహారం నడపడానికి నాకు పదిమందిప్లీడర్లు ఆధారంవున్నారు.

శేషయ్య—ఇంకేం ? అయితే కాస్త సావకాశం చూసుకుని విభాగానికి దావా పడెయ్యి నువ్వు.

పేరుభట్టు—వాడిమీదా ?

శేషయ్య—నన్నుకూడా కలిపే...... నేను దావాకి వొప్పుకుంటాను.

పేరుభట్టు—సరే. అయితే వుమ్మట్లోనుంచి నువ్వేమాత్రమో తీసుకుంటున్నావుట కాదూ ?

శేషయ్య—మూడేళ్లయింది మానేసీ.

పేరుభట్టు—మూడేళ్లా ?

శేషయ్య—ఏమనుకున్నావుమరి? నేను మానేశాకే రుణానికి మొదలు.

పేరుభట్టు—ఇప్పటికీ తీసుకుంటున్నావన్నాడు మొన్న.

శేషయ్య—నాయెదట అనమనూ.

పేరుభట్టు— ఎంతదగా ?

శేషయ్య—నువ్వేం చూశావురా ? ఇంతకీ ; అమ్మ చేస్తోంది వాణ్ణిలాగ.

పేరుభట్టు—అవునవును.

శేషయ్య—బతికివున్నప్పుడు చిన్నమామ బంగారం పెళ్లిమాట యెప్పుడేనా తెచ్చాడా ?

పేరుభట్టు—లేదు లేదు. కాని కోటమ్మదొడ్డమ్మ వెంకన్నకోసం వొకమాటు ప్రయత్నంచేసిందిట. అదో గమ్మత్తుకథా. తరవాత చెబుతానులే. ఇప్పుడు చెబితే- తలుచుకుంటె నవ్వువస్తోంది. తరవా—తా—ర త్తమ్మ పిన్ని రాయడుకోసం వొడుకేస్తోంది.

శేషయ్య—అత్తవుద్దేశం యేమిటో ?

పేరుభట్టు—బ్రహ్మభేద్యంగావుంది; కాని బంగారంమాత్రం క్షణమేనా విడిచివుండలేకుండావుంది నన్ను.

శేషయ్య—మంచిమాట విన్నాను. ఈ పది రోజులూ వెళ్లిపోయాక కాస్త సంగీతం మొదలుపెట్టు. అత్తకి చేదోడువాదోడుగావుంటేవా, ముందు లాభిస్తుంది. తెలిసిందా ?

పేరుభట్టు—నాజాగ్రత్తలో నేనున్నాను.

శేషయ్య—“యత్నేకృతే యది నసిద్ధ్యతి కోత్రదోషః” కాని అత్త మామంచిమనిషిరా. ఏమాత్రమో నిలవవుందనుకుంటాను.

పేరుభట్టు—ఉండవచ్చు.

శేషయ్య—ప్రకృతస్థితి యెలావుందీ ?

పేరుభట్టు—ఏంచెప్పనూ ? పొద్దున్న వొక షాహుకారుచెల్లెలు రెండుకాశీళ్లసామాను పట్టించుకువచ్చింది. వొకప్లీడరుగారు పాతికరూపాయలు పంపారు. “నెయ్యీ, నూనీ యెంతపడ్డాసరే, డబ్బాలు పంపించండి” అని యిందాకా వొకషాహుకారు చెప్పివెళ్లారు. మామయ్య బతికివుండి, బంగారంపెళ్లిచేస్తే నా పెద్దన్నయ్యా, సప్లయిలికి యిల్లుచాలకపోవును.

శేషయ్య—ఈశ్వరకటాక్షం యింతేవుంది.

పేరుభట్టు—నాదురదృష్టంకూడా తోడయింది.

శేషయ్య—మామయ్యావుంటే నీకు ఆశలేకపోవునేమో ?

పేరుభట్టు—ఉంటే సందేహమేలేకపోవును.

శేషయ్య—ఏమయినా, కనుగలిగివుండు. ఆవిడ చెప్పినట్లు మసులుకో.

(అప్పుడు ప్రకాశంవస్తాడు.)

ప్రకాశం—(వెనక్కితగ్గుతాడు.)

పేరుభట్టు—దయచెయ్యండి. మాయింటిగొడవ చెప్పుకుంటున్నాం. పెద్దన్నయ్యా, వీరిని నువ్వెరగవనుకుంటాను. చేబోలు ప్రకాశంగారని—యెదటియిల్లు వీరిదే. వీరు హితకారిణీహైస్కూల్లో ప్రధానాంధ్రోపాధ్యాయులుగా వున్నారు. నెలకి యాభైరూపాయలిస్తారు వీరికి.

శేషయ్య—అలాగా ?

పేరుభట్టు—మామ పోయినప్పుడెవరూ లేకపోగా దహనసంస్కారం—

శేషయ్య — ఏంపుణ్యాత్ములండీ ! మహానుభావా ! నమస్కారం. దయచెయ్యండి.

ప్రకాశం—చిత్తం చిత్తం. తమరుపెద్దలు —

పేరుభట్టు—దయచేశారుకారు. కూచోవాలి. (తానుజరిగి చోటుచూపిస్తాడు.)

ప్రకాశం—కూచోడానికి సందేహంలేదు; కాని కొంచెంపనివుంది. అత్తయ్యగారు మిమ్మల్ని—వీరు మీపెద్దన్నగారా ?

పేరుభట్టు—అవునండి. నేనంటే ప్రాణం యితనికి. మొదణ్ణుంచీ మేమిద్దరమూ వొకటి.

ప్రకాశం—అయితే సందేహం అక్కర్లేదు. అత్తయ్యగారు మీతో మాట్లాడాలంటున్నారు. అయ్యా ! మీరుకూడా రావచ్చు.

శేషయ్య—మీరిద్దరూ—

పేరుభట్టు—నువ్వూ రావాలి.

(అప్పుడు బంగారమ్మ వస్తుంది.)

బంగారమ్మ—పెద్దబావనికూడా తీసుకురమ్మంటోందండీ మామయ్యగారూ, మాఅమ్మ.

ప్రకాశం—సందేహంతీరిందా ? మరి లేవండి.

శేషయ్య—మీ సెలవు.

(అందరూ లేచివెడతారు. బంగారమ్మ పేరు భట్టుచెయ్యిపట్టుకొని వెడుతుంది.)

రెండో రంగం

[కాంతమ్మ యిల్లు. దక్షిణపువసారాలో రత్తమ్మా, రాయడూ నుంచునివుంటారు.]

రత్తమ్మ—పెద్దాడువచ్చాక మరి కాస్త చెడ్డట్టుందిరా మన పనీ.

రాయడు—ఓపికపట్టాలి. రెండుపుట్ల భూమివున్నవాణ్ణి నేను. ఇంగ్లీషు చదివాను. బంగారాన్ని గురించి నాకు అనుమాన మేమీ లేదు.

రత్తమ్మ—ఉండకూడదు.

రాయడు—అత్త ప్రతీపనినిగురించీ పేరుభట్టుతోటీ, శేషయ్యతోటీ ఆలోచిస్తూం దేమీ అనుకోకు. వాళ్లు చాకిరీచెయ్యడంలో చాలా తెలివయినవాళ్లు.

రత్తమ్మ—చెప్పిన పనులన్నీ తెలివి తేటలతో చేస్తూవుంటే పేరుభట్టు ప్రయోజకుడవుతాడనుకోదూ అదీ ?

రాయడు—ఇంటోవున్నవాట్టుకు చక్క బెట్టడమూ తెలివంటే? సంపాదించవద్దూ? సంగీతం వచ్చినంతమాత్రాన సంపాదించగలడా? ఇంతకీ: సంగీతంలో తెలివిపుడితే మళ్లీ కావ్యాల్లో యెందుకు ప్రవేశిస్తాడూ? సరే, భూములసంగతి మనకి తెలిసిందే కదా? పంచుకోడంఅంటూ వస్తే మనిషికి యకరం దాటదు. అదేనా యీలోపుగా సూరన్న మిగలనిస్తేనూ.

రత్తమ్మ—మొన్న కాకినాడవెళ్లి ఆరురోజుల్లో రెండువందలనలభై తెచ్చాట్ట.

రాయడు— బోగందానివెనకాల హంగుచేసీ. అదేనా జన్మానికోమాటు. ప్రతీనెలా యిలా తేగలుగుతున్నాడనుకున్నావా యేమిటి ?

రత్తమ్మ—ఈవూళ్లో నెలకి యాభై—

రాయడు—నాకు భూములమీదే వస్తాయి కాలుమీద కాలువేసుక్కూచున్నానూ నెలకి డెబ్భయి రూపాయలు. పైగా యే మేష్టరీచేసినా పాతికరూపాయలు తేగలను. దైవం మేలుచేసి సబురిజస్ట్రారుకచేరీలో గుమాస్తాపని దొరికిందంటే జీతంకాక రోజుకి నాలుగురూపాయలేనా చులాగ్గా యేరేస్తాను.

రత్తమ్మ—అయినా పేరుభట్టుమీద బంగారానికీ, అత్తకీ యిష్టం ముదరనివ్వకూడదు.

రాయడు—నీకాసులపేరు మారువాళ్లీదగ్గరవుండిపోడమూ, యిప్పుడిక్కడ అసాధ్యపురోజులు రావడమూ తటస్థించింది; గాని లేకపోతే అది బంగారం మీదపడేస్తే బజానాలాగ బిగిసి—యెందుకూ ?

రత్తమ్మ—మీనాన్న నావస్తువుల్లో వొకటేనా అట్టేపెట్టారట్రా? పైకి చెప్పకుంటేసిగ్గు. ఆయనికి ప్రయోజకత్వ మేవుంటే ఆరుయకరాలభూమి తనఖాలో పడిపోతుందా? నీకు యాభైయేళ్లువస్తేగాని అది స్వాధీనంకాదాయె. అత్తకి చెప్పాడో లేదోగాని యిది మామయ్యకికూడా తెలుసును.

రాయడు—ఇప్పుడేనా పెత్తనం నామీద పడేస్తాడా నాన్న ?

రత్తమ్మ—నామీద పడేసినా బాగుండిపోను మొదణ్ణుంచీనీ. వద్దుమొర్రోఅంటూంటే కాగితాలమిల్లులో నాలుగువేలు తగలేశారు. ఆరుణం మనకిప్పుడు నల్లతాచై మెడకిచుట్టుకుంది.

రాయడు—అదంతా యిప్పుడేంలాభమూ? నీశక్తి కొద్దీ ప్రయత్నంచెయ్యి.

రత్తమ్మ—నువ్వు చాలా జాగ్రత్తగావుండాలి. నీలాంటి పెళ్లికొడుకు దొరకడనుకోవాలి కాంతమ్మత్త.

రాయడు—వో! చూస్తూవుండు.

(తెరలో)

మా వెంకడు వచ్చాట్టే యిలాగ రత్తమ్మా?

రత్తమ్మ—దొడ్డమ్మ వస్తోంది, నువ్వింటోకి వెళ్లిపోనాయనా!

రాయుడు—నిజంగా పెద్దమ్మే ఆవిడ. మొఖం మీద యెప్పుడూ దరిద్రం వోడుతూ వుంటుంది.

(రాయుడు లోపలికి వెళ్లిపోతాడు. కోటమ్మ వస్తుంది.)

కోటమ్మ—యేమిటమ్మా కొడుకూ, నువ్వూ మాట్లాడుకుంటున్నారూ?

రత్తమ్మ—తమ్ముడిమాటే. ఇంకా పదికాలాల పాటు బతికివుంటే యెంతేనా బాగుపడును.

కోటమ్మ—బంగారమ్మతోపాటు వొక మొగ పిల్లాడేనా కలిగివుంటే రాజాంగంగా వుండును.

రత్తమ్మ—పెట్టిపుట్టవద్దూ? కూతురికేనా పెళ్లి చేసుకునే యోగం లేకపోయింది.

కోటమ్మ—తమ్మ డెంత దురదృష్టవంతుడో చూడూ. కూతురికి పెళ్లిచేసి అల్లుణ్ణి యింటో పెట్టుకుంటే అదో అందంగా వుండును. అదేనా జరిగింది గాదు.

రత్తమ్మ—అయితే అక్కయ్యా? (మెల్లిగా) వెంకన్నకిమ్మని అడిగావుటకాదూ బంగారాన్ని?

కోటమ్మ—యేదో అడిగానేఅనుకో. ఆలోచించి చెబుతామన్నారు మొగుడూ పెళ్లామూనూ. పదిహేను రోజులు తిరగలేదింకా. ఏమిశాశ్వతమే?

రత్తమ్మ—వాళ్ల వుద్దేశం యేమేనా తెలిసిందా?

కోటమ్మ—మరదలిష్టపడ్డట్టే తోచింది. తమ్ముడు మాత్రం చదువులేదని సందేహించాడనుకున్నాను. అయితే వెవసాయంకూడా చదువుల్లోనే లెక్కట. మీ బావ చెప్పారు. ఇప్పు డింగ్లీషు చదివినా లాభం లేదుట. బ్రాహ్మలకెక్కడా వుద్యోగాలు దొరకడం లేదుట. అదేదీ? అదేదోనమ్మా! దాని పేరు నోట్లో ఆడుతోందీ. అదివచ్చాక వున్న వుద్యోగాలుగూడా మానేస్తున్నారుట అంతానూ. నీకొడుకు నాలుగేళ్లయింది చదువుమానేసీ. యిప్పటికేనా నౌకరీ దొరకదాయె.

రత్తమ్మ—నాకొడుక్కి నౌకరీకర్మం యేమిటే? రాజులాగ వుద్యోగంచేస్తాడువాడు. యేమే స్రీటుకచేరీలోనో గుమాస్తాగా చేరాడంటే రోజుకి నాలుగు రూపాయలేనా కళ్లబడతాయి. ఉద్యోగం దొరక్క వూరుకోలేదు మావాడు. ఇప్పణ్ణుంచీ యెందుకూఅని చూస్తున్నాం.

కోటమ్మ—వస్తేచేదని మానేశామంటావా?

రత్తమ్మ—కాకపోతే? మావాడెక్కడికి వెళ్లినా నెత్తిమీద పెట్టుకుని యిస్తారు పని.

కోటమ్మ—ఉద్యోగం వస్తే స్వతంత్రం వుండదుటే.

రత్తమ్మ—వచ్చినవాళ్లకి బాధలేదు.

కోటమ్మ—మీరుణాలు తీరిపోయాయా?

రత్తమ్మ—ఇంతసేపా? చిల్లరరుణాలేమేనా వుంటే వుద్యోగందొరికిన ఆరుమాసాల్లో తీర్చేస్తాడు మావాడు, ఆడుతూ పాడుతూనూ.

కోటమ్మ—మాకు రుణాలు లేవుసుమా. మావాడు పదిరూపాయలు తెస్తే పదీ నిలవే.

రత్తమ్మ—కాస్త భూమివున్నవాళ్లకి రుణాలెవరిస్తారూ? లెక్కాడకపోతే డొక్కమాడుతుందాయె.

కోటమ్మ—మేమేం లోటుగా వున్నామూ? మీలాగ మజ్జిగనీళ్లకి లోటులేదు. నేతికీ లోటులేదు. పొలంలో మావాడు అన్నికూరగాయలూ కాపిస్తాడు. ప్రతీ రోజూ నేను మీలాంటివాళ్లకి పదిమందికి పంచిపెడుతూనేవుంటాను. బెల్లానికి బెల్లం, ధాన్యానికి ధాన్యం, పప్పుదినుసుకి పప్పుదినుసు—యేంలోటు మాకూ?

రత్తమ్మ—(స్వగతం) ఇక పాకం ముదరబెడుతుందది. (ప్రకాశం) ఎవరికీ యేంలోటూ లేదు. పద, స్నానంచేద్దాం.

కోటమ్మ—నేను కూచోమన్నానా యేమిటి నిన్ను? (వెళ్లిపోతుంది.)

రత్తమ్మ—ఇదా సమయం? సరసం యెరగదు......అదెంతగింజుకున్నా మరదలు బంగారాన్ని వెంకడికివ్వదు. నాకొడుకూ, నేనూ పెట్టిపుడితే అది నాయింటో నేపడుతుంది. ప్రయత్నిం మానను. (వెళ్లిపోతుంది.)

మూడో రంగం

[ప్రకాశం యిల్లు. దొడ్డిసమ్మెంమెట్లమీద బంగారమ్మా, సుబ్బమ్మా కూచునివుంటారు.]

సుబ్బమ్మ—నేను రమ్మంటూంటే అదంతా నీకెందుకూ?

బంగారమ్మ—మీయింటికి నువ్వుపెద్దవా?

సుబ్బమ్మ—మాఅమ్మ నామాట తీసెయ్యదు. మాచిన్నన్నయ్యకూడా యేమీ అనదు.

బంగారమ్మ—ఎందుకంటావూ?

సుబ్బమ్మ—అనడంటున్నానుకాదూ?

బంగారమ్మ—అసలీమాట యెందుకురావాలీ?

సుబ్బమ్మ—అదేమిటే అలాఅంటావూ? మావాళ్లూ, మీవాళ్లూ పోట్లాడుకున్నారు కాదూ మరీ?

బంగారమ్మ—వాళ్లకి కలిసిందా?

సుబ్బమ్మ—లేదు—

బంగారమ్మ—మీఅమ్మ కలవనిస్తేకాదూ? (దుఃఖిస్తూ) మానాయన—మీఅమ్మమూటే మిగిలింది.

సుబ్బమ్మ—మామయ్యవుంటే నామాట తీసెయ్యగలుగుదువా నువ్వు?

బంగారమ్మ—మానాన్నవుంటే మీరిక్కడికెందుకు వస్తారూ యిప్పుడూ? మానాన్న చచ్చిపోయాడుగనక మీఅమ్మ సంబరపడుతూ వచ్చింది. ఆవిడితోగూడా నువ్వు వచ్చావు. లేకపోతే నామొగం నీకూ, నీమొగం నాకూ కనిపించకేపోవు నింతట్లోను.

సుబ్బమ్మ—అవన్నీ యెందుకే యిప్పుడూ?

బంగారమ్మ—మా నాన్న బతికివుండగా మీ అమ్మ మాగుమ్మంలో అడుగు పెట్టలేకపోయింది. మా నాన్న మీఅమ్మకేంలోటు చేశాడూ? ఏటామూడు—

సుబ్బమ్మ—మాదొడ్డమ్మకీ, మా పిన్నికీకూడా పెట్టాడుగాని మాఅమ్మకి వొకత్తికే పెట్టాడేమిటి మీనాన్న కోకలు? అయినా అదంతా యిప్పుడెందుకూ? నువ్వు—

బంగారమ్మ—అనవలసినమాట అనేశావు. చివరికదంతా యెందుకూఅని తేల్చేశావు. మీఅమ్మ వొక్కత్తేనా యేమిటి మానాన్నకి తోడబుట్టుపడుచు? మీ అమ్మకిమాత్రం పెట్టి వూరుకుంటే పెద్దత్తయ్యా, బుల్లత్తయ్యా వుసూరుమనరూ? ఆవుసురెందుకు తగలాలీ మాకూ?...... మానాన్నలాంటివాడున్నాడా? మీఅమ్మ "యేం పట్టుకుపోతావూ" అందిట. ఏమీ పట్టుకుపోలేదు మానాన్న. నిజమే. చచ్చిపోయినవాళ్లంతాకూడా పట్టుకుపోతున్నారా యేమిటి యేమేనా? మీనాన్నయేమేనా పట్టుకుపోయాడా? మీపెద్దక్క యేంపట్టుకుపోయిందీ?

సుబ్బమ్మ—(మాట్లాడదు)

బంగారమ్మ—అప్పుడు వొక్కరూపాయికూడా చేతిలో లేదుట. ఉంటే అనుకోవచ్చు. ఎన్నివిధాల చెప్పినా వినక "నీమూలాన పెళ్లిపడిపోయిం" దందిట మీఅమ్మ. "నువ్వు ముందుకువస్తావా?" అందిట. ఏమిటేమిటో అందిట. వాళ్లదగ్గిరా వాళ్లదగ్గిరా "వీడు మన్నుతాడా?" అందిట. మానాన్న వెళ్లిపోయాడు. పోనీ మీఅమ్మని యెల్లకాలమూ వుట్టికట్టుకుని వూరేగమను.

సుబ్బమ్మ—ఇప్పుడామాటలెందుకే? మా అమ్మకేమీ తెలవదే.

బంగారమ్మ—అడిగిన బదులివ్వకపోతే శాపాలు పెట్టడం తెలుసునా? మానాన్న మీ సొమ్మేమేనా తిన్నాడా?

సుబ్బమ్మ—నాయోగం. నేనేంచెప్పనూ ?

బంగారమ్మ—నీకేమీ యోగానికీ? మారాత వ్రాప్రారబ్ధం (దుఃఖిస్తుంది).

(అప్పుడు పేరుభట్టువస్తాడు.)

పేరుభట్టు—అదేమిటె బంగారం ?

బంగారమ్మ—(కళ్లుతూసుకుని మరింత దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—(బంగారమ్మని పొదివిపట్టుకొని) ఎందుకే సుబ్బూ బంగారం యేడుస్తుందీ ?

సుబ్బమ్మ—వాళ్ల నాన్నని తలుచుకుని యేడుస్తోంది బుల్లన్నయ్యా !

పేరుభట్టు— ఏంలాభం బంగారం ? ఇలా చూడమా. ఊరుకోవూ ?

(బంగారమ్మ లేచి నిలుచును. పేరుభట్టు ఆమెను యింటికి తీసికొనిపోవును)

సుబ్బమ్మ— (స్వగతం) మాఅమ్మే మంచిది కామా. తలుచుకుతలుచుకు యేడుస్తోందివొదిన. పాపం దానికెంత కష్టంగావుందో ?........వాళ్ల అమ్మతోటి నేనేమేనా అన్నానంటుందేమో ? నేనేమన్నానూ ? నేనేమీ యెరగనుబాబూ ! వాళ్ల నాన్నని తలుచుకుని అదియేడుస్తోంది......మామయ్య చాలామంచివాడు. నాకు యేడాదికి మూడు పరికిణీలిచ్చేవాడు......నా కర్మం ! వొదిన మాయింటికిరాదు.

(వెళ్లి పోతుంది.)

నాలుగోరంగం

[కాంతమ్మయిల్లు. వీధిఅరుగుమీద రాయడు నుంచునివుంటాడు. వెంకన్న ఆయాసపడుతూ వెలికిల పడుకుని వుంటాడు. అరుగుకింద చాకలి నుంచుని వుంటుంది.]

రాయడు—మడేలూ ! నువ్విల్లుకని పెట్టుకుని వుండడం నిజమే; కాని చాకిరీ సరిగ్గాచేశావుకావు. నేననడం యెందుకూ ? నువ్వేఆలోచించుకో.

చాకలి—ఏంలోటు—

రాయడు — ఇక మాట్లాడకు. అయిందేదో అయిపోయింది. గొడవలు పెంచకు. పెట్టిందేదో పట్టుకు పోయి కళ్లనద్దుకుని సుఖంగా తినండి నువ్వూ, మొగుడూ, పిల్లలూను. నుంచో వస్తారు...యెవరక్కడ? వొరేయ్ ! వెంకన్నతమ్ముడూ ! చూడూ, చాకల్దానికి అన్నమూ, పప్పూ, కూరా, పులుసూ, నాలుగు బూరిముక్కలూ–

చాకలి—నాలుగేనంటండీ ?

రాయడు—నాలుగంటేనాలుగే? చూడరా మూ? అయినా యిదేం శుభకార్యమాయేమిటి తిన్ననీన్ని పెట్ట డానికి ? నల్లరాయి బద్దలాసిపోయింది. ఏదో తంతు నడపకతప్పదు. పెట్టిందేదో పట్టుకుపో. వెళ్లరా వెంకన్న తమ్ముడూ !

వెంకన్న — ఏమిటన్నయ్యా! చెబుతున్నావూ?

రాయడు—ఇందాకణ్ణుంచీచెప్పిందంతా అరణ్యరోదనమే ? ఓరితులసీదాసూ ? చూడూ ! ఈచాకల్దానికి అన్నమూ, పప్పూ, కూరా, బూరిముక్కలూ–

చాకలి—ముక్కలెందుకండీ? ఎన్ని పెట్టాలని వుంటే అన్నీ బూర్లే పెట్టండి మారాజా !

రాయడు—అవేనే. అర్థాలు మాబాగా తీస్తున్నావే? వెళ్లరా తమ్ముడూ! సిసిందిరిలాగ పని చెయ్యాలి యివాళ.

వెంకన్న—నీకేం చెబుతావు కడుపునిమురుకుంటూ కూచునీ. నా కాయాసంగావుంది. కాస్తసేపు పడుకుని దొర్లితేగాని నేను కదల్లేను.

రాయడు—వేశావూ ? వెఱ్ఱిమొగమా ! ఓ మాటిలారా చెబుతాను.

వెంకన్న—నావల్లకాదు.

రాయడు—ఛా ! నీకు లాభించీదీ తెలవదు, మరొకళ్లకి లాభించీదీ తెలవదూ నీకు. పోనీ నేనేం చెయ్యనూ ? నీయిష్టం.

వెంకన్న—(దగ్గిరికివెళ్లి) అదేమిటో చెప్పు.

రాయడు—ఇలారా! (చెవిలో) బంగారాన్ని నీకు పెళ్లిచెయ్యాలని చూస్తోంది మీయమ్మ, జ్ఞాపకంవుందా?

వెంకన్న—అవును.

రాయడు—ఇలాంటప్పుడు చుగ్గగ్గావుండక పోతే—తెలిసిందా? గప్ చిప్! వుండవే నిమిషంలో వస్తాడు మావాడూ. పులుసుకేదేనా తెచ్చుకున్నావా?

చాకలి—పులుసుకుండ నాకిచ్చేసే దేనండి.

రాయడు—అయితే సరే. అలాసందులోకిపద. పదరా తమ్ముడూ!

(అందరూ వెళ్లిపోతారు.)

అయిదోరంగం

[ఉత్తరపువసారాలో కాంతమ్మా, బంగారమ్మా, శేషయ్యా, పేరుభట్టూ, ప్రకాశమూ నుంచునివుంటారు.]

కాంతమ్మ—మీరు నలుగురూ వుండబట్టి వొడ్డెక్కించారు. పేరుభట్టుమాట చెప్పనే అక్కర్లేదూ. తుదకి నువ్వుకూడా కష్టపడవలసివచ్చింది. అన్నయ్యగారి సంగతి—

ప్రకాశం—కష్టంఅంటే యెక్కడికి? కాక పోయినా కష్టపడకుండా సంసారం గెంటుకు పోగల వాళ్లు మనలోయెవరు?...ఇంతకీ: కోమట్ల పుణ్యానూఅని సకలవస్తువులూ కావిళ్లకొద్దీ వచ్చాయి. గనక ఖర్చు పెట్టడానికి నేనంటే నేనని పందాలు వేసుకుని సిద్ధపడ్డాం మేము.

శేషయ్య—కాస్తోకూస్తో కష్టపడ్డాం. నిజమే. అయితే యీకష్టం మామయ్యబతికివుండి బంగారంపెళ్లి చేసి—ఆపెళ్లిలో పడివుంటే ఆనందంగావుండును.

కాంతమ్మ—అంతసౌభాగ్యానికి మేము పెట్టి పుట్టవద్దూ? అందమూ, ఆనందమూ వున్నా లేక పోయినా యీకష్టంమాత్రం తప్పదా? యెప్పుడేది యెలా చెయ్యాలో, యెవరితో యెలామాట్లాడాలో వోపికపట్టాలి. ఇదిమాత్రం సామాన్యమూనాయనా?

శేషయ్య—ప్రకాశంగారివంటివారు బహు అరుదుగావుంటారు. అత్తా, యెదట చెప్పడంకాదు. నిగర్వి అన్నా, పరోపకారిఅన్నా ప్రకాశంగారినే చెప్పాలి. చూడలేదు నేనెక్కడా యిలాంటి మహానుభావుణ్ణి. ఆశ్చర్యంఅయింది.

పేరుభట్టు—ప్రకాశం బాబుగారి సాయమూ, సలహాలూ లేకపోతే మాకష్టానికి వినియోగమే లేక పోవును.

ప్రకాశం—బాణాలు నామీదకి తిప్పేరూ? అన్నాతమ్ముడూ యేకమయినాక నే నాగగలనామరీ?

పేరుభట్టు—ఎంతమందయినా మీగోటికి చాలరు.

శేషయ్య—మీకు సమాధానం చెప్పలేను. మరి పొద్దెక్కుతోంది. రైలు దాటిపోతే చిక్కుపడాలి. సెలవూ.

ప్రకాశం—అవునవును. పెందలాడే వెళ్లాలి. టైము ఆట్టే లేదు.

శేషయ్య—అత్తా!—

కాంతమ్మ—దిక్కుమాలినఅత్త. నేటికీయింటికి అత్తపెద్దనయిందా? నాకర్మం. నాయనా! నీతో పదిమాట్లు చెప్పడంగాను. అక్కర్లేదు కూడానూ. మాస్థితి నువ్వు కళ్లారా చూసేవున్నావు. కాస్త కనిపెడుతూవుండాలి.

శేషయ్య—రాగూడని ఆపత్తు వచ్చింది. దైవికానికెవరూ యేమీ చెయ్యలేరు; కాని పేరుభట్టు యిక్కడేవుంటాడుగనక యింకేమీ భయం వుండదు. తరుచు నేను వస్తూనే వుంటాను కూడానూ. తమ్ముడూ! నీకు పదిమాట్లు చెప్పనక్కర్లేదు. జాగ్రత్తసుమా. ప్రకాశంగారూ! తమ్ముడికి కొంచెం వ్యవహారజ్ఞానం కలిగిస్తూవుండాలి మీరు.

ప్రకాశం—నాకే నేర్పగలరు మీతమ్ముడుగారు.

పేరుభట్టు—మీమాట మీవాత్సల్యానికి గుర్తు.

శేషయ్య—బంగారం! మరివెళ్లనా?

బంగారమ్మ—వెడతావా పెద్దబావా! (దుఃఖి స్తుంది.)

శేషయ్య—(బంగారమ్మని పొదివిపట్టుకొని) యేడవకమ్మా. మళ్లీ వారంరోజుల్లో రానూ? బుల్లి బావ యిక్కడే వుంటాడుగాడుటమ్మా? తమ్ముడూ! బంగారాన్ని చూశావా? అమాయకురాలు. సుకుమారి. భద్రం.

పేరుభట్టు—అలాగే అన్నయ్యా! (అని బంగా రమ్మని దగ్గిరికితీసుకుంటాడు.)

శేషయ్య—అత్తా! ప్రకాశంగారూ! మరి సెలవు. మీవోదిన బండియెక్కిందిగాదూ తమ్ముడూ? సరిగ్గా ప్రయాణంనాటికి వచ్చిందిఆంక్ష. ఆడాళ్లతో ప్రయాణం యిలాగేవుంటుంది. ఇకరా.

పేరుభట్టు—సాగనంపివద్దాంరా బంగారం!

(తెరదించాలి.)

అయిదో అంకం

మొదటిరంగం

[నాళంవారిసత్రంలో భోజనాలహాలు పక్క గది. పేరుభట్టూ, భద్రయ్యా కూచునివుంటారు.]

భద్రయ్య—పెళ్లాం కాపరానికివచ్చినక్రొత్తలో మనవయస్సులో వుండేవాడికి ప్రపంచకం తెలవక పోవడం సహజమే; కాని నాపని అందుకు తారుమా రయింది. ఇదివరకి నేనిక్కడ వారాలతో యెలాగో కాలం గడిపేశాను. ఇకముందుకూడా అలాగే చెయ్య రాదాఅంటే యింటావిణ్ణి తీసుకురాకతప్పదు.

పేరుభట్టు—అవుప్పెన యేమిటోయి?

భద్రయ్య—పున్నమి వెళ్లినతదియ—యివాళకి పన్నెండురోజులుంది. "ఈముహూర్తం తప్పిపోడానికి వల్లగాదు. తరవాత నీపెళ్లాన్ని నేనుభరించలే" నని—

పేరుభట్టు—బ్రహ్మరాక్షసిలావుందే?

భద్రయ్య—సవతితల్లి అంతకంటె యెక్కువ చేస్తుందని మనం ఆశించడం యెలాగా?

పేరుభట్టు—(ఆలోచిస్తాడు.)

భద్రయ్య—బాగాఆలోచించు.

పేరుభట్టు—ఇప్పుడు నీదగ్గిర యేమాత్రం వుందో నిజంచెప్పు.

భద్రయ్య—కార్యానికయినఖర్చులు పోగాబ్రహ్మ కేనా తెలవకుండా యిక నూటపాతిక జాగ్రత్తచేశాను. ఆర్నెల్లకేనా చాలదు.

పేరుభట్టు—భూములమీద—

భద్రయ్య—పొల్లుగాయలుగూడారావు...... ఇంకా పదేళ్లు రెక్కలమీద బతకాలి. అంచేతే పురాణధోరణో అంటూ నేను గోలపెడుతూవచ్చాను. దిక్కుమాలిన కలరావచ్చి పడింది గాని—

పేరుభట్టు—తగ్గి యెన్నాళ్లయిందోయి?

భద్రయ్య—నిజమే. అయితే భయంవల్ల కొన్నాళ్లు, యింటో చిక్కులువచ్చి కొన్నాళ్లు, కార్యం గొడవలు కొన్నాళ్లు—

పేరుభట్టు—లేకలేకవచ్చిన పెళ్లాన్ని విడవలేక కొన్నాళ్లు—

భద్రయ్య—చెప్పానుకాదూ? అది యెంత వాడికి? పెళ్లాం దగ్గిరికి వచ్చాటప్పటికి "దీన్ని పోషించడం యెలాగ?" అంటూ ఆలోచనపడితే యింకేం సుఖమోయి?

పేరుభట్టు—సరే, కానియ్యి.

భద్రయ్య—ఇంతలో కోనసీమనుంచి వొక శాస్త్రులుగారు వచ్చి మావూళ్లో రెండుమాసాలు రామాయణం పురాణంచెప్పారు. చదవడం నామీని పడింది.

పేరుభట్టు—ధోరణిలో పడ్డావా?

భద్రయ్య—మునపటికంటేనయం. అయితే నే నోగమత్తుచేశాను. రాత్రి శాస్త్రులుగారిదగ్గిర

మూలం చదవడం. మర్నాడు మధ్యాహ్నం ఆడాళ్లని పదిమందినిచేర్చి ఆభాగమే సొంతంగాచదివి, సొంతంగా చెప్పడం.

పేరుభట్టు—భేషూ!

భద్రయ్య—లేకపోతే పద్మవనంలోపడ్డ రాసభంలాగ—

పేరుభట్టు—ఇందులో రెండులాభాలు. చూశావా? ఒకటి పురాణధోరణి పట్టుపడడమూ, నలగడమూనూ. రెండోది స్త్రీలకి పురాణంచెప్పగలగడం. ఇక ఫరవాలేదు నీకు.

భద్రయ్య—దీంతో యేమయిందంటే? పండితులయెదట కొంచెం నట్టినా—

పేరుభట్టు—ఒకపండితుడు పురాణంచెబుతూ వుంటే యింకోపండితుడువచ్చి దద్దమ్మలాగ వింటూ కూచుంటా డనుకున్నావా యేమిటి? సామాన్యులకే పురాణం.

భద్రయ్య—అయినా యిక్కడ నాచేత పురాణం చెప్పించేవారెవరు?

పేరుభట్టు—దేవుడు.

భద్రయ్య—అంటే?

పేరుభట్టు—దీపావళి యెన్నాళ్లుందీ?

భద్రయ్య—అయిదురోజులు.

పేరుభట్టు—కార్తీక శుద్ధపాడ్యమినాడు తెల్లవారగట్ల నాలుగ్గంటలకిలేచి, నాళంవారి సత్రంరేవులో స్నానంచేసి కార్తీకమాహాత్మ్యం పురాణం—

భద్రయ్య — ఏమన్నావు?

పేరుభట్టు— ఈనెల్లాళ్ల సాధనవల్లా తరవాత నువ్వుపౌరాణికుడుగా చెలామణీ కావడానికి అభ్యంతరం—

భద్రయ్య— (చెయ్యి జాడిస్తూ) సెబాస్! రక్షించావోయ్! ఈకార్తీకంలో, వందరూపాయలేనా యేశేస్తాను. ఇక లే. నామూలాన నీకుకూడా పొద్దుపోవడంయెందుకూ? పాపం బంగారమ్మ నీకోసం యెదురుచూస్తూవుంటుంది.

పేరుభట్టు—ఇక కొట్టుకుపోతావన్నమాటే.

భద్రయ్య—నిస్సందేహంగానూ. మరిపద.

(వెళ్లిపోతారు.)

రెండోరంగం

[కాంతమ్మ యిల్లు. హాల్లో బల్లమీదకూచుని పేరుభట్టు.]

పేరుభట్టు—(స్వగతం) ఎందుకూ భద్రయ్య కాగూడవా? నాకూ తనకీ స్నేహంవుంటే నాదగ్గిర అనాలి...నాదగ్గిరమాత్రం యెందుకు తేలడం? అత్త దగ్గిర అంటాడా? దుడుకుమనిషి. నిదానం లేదు. ఇంగిత జ్ఞానం లేదు. అత్త యేమనుకుంటుందో? నేనిందుకోసమే యింటో చేరాననుకుంటుందో యేమిటో?...నిజానికి నాకు ఆకోరికవుంది. తప్పకుండావుంది. కాని యేం లాభమూ? ఈవిషయం అత్తదగ్గిర చూచాయగా అయినా తేలుద్దామంటే గుండెలు తాళడంలేదు. తాళడానికి నాతాహతెంత? నేనెంత?...............
బంగారం మనకితక్కదు. మరిచిపోవలిసిందే......మరిచిపోవలిసిందే అంటే యెలాగ? ఓపూట ఆలస్యంగా కనబడితే తర్జనభర్జన చేసేస్తుంది. ఇంటోవుంటే రాత్రీపగలూ కల్లీబొల్లీమంటూ తోచనివ్వదు. నన్ను సంతోషపెట్టడాని కనేకవిధాల ప్రయత్నంచేస్తుంది. బావా అనేటప్పటికి నాకు వొళ్లు పొంగిపోతుంది. ఇంకెలాగ మరవడం?...... ఎలాగఅంటే అలాగే. ఆశవొదులుకోకతప్పదు. కాదంటే యెలా లభిస్తుందీ?

(అప్పుడు బంగారమ్మ వస్తుంది.)

బంగారమ్మ—రాత్రి వచ్చావుకాదేం బావా? (ఎదట మోకాళ్లమీదకూచుని) సగంరాత్రిదాకా మేలుకున్నాను, ఇంకేవస్తావో యింకేవస్తావో అనీ, తలుపు తియ్యడానికి.

పేరుభట్టు— రాలేక పోయాను బంగారం! (ఇలాచెబుతూ ఆమెని వొళ్లోకూర్చో బెట్టుకుంటాడు.)

బంగారమ్మ—తెల్లారగట్ల బండిమీద తప్ప కుండా వస్తావనుకుంటూ నిద్రపోయాను. జామురాత్రి వేళ మెళుకువవచ్చింది. ఇక నిద్రపోకుండా కూచుం దామనుకున్నాను గాని ఆగలేకపోయాను. నేను లేచా టప్పటికి నువ్వు పాఠాలుచెప్పడానికి వెళ్లిపోయావుట.

పేరుభట్టు— దయవుందికనక నాకోసం అంత సేపు మేలుకున్నావు; కాని—

బంగారమ్మ—దయో గియో నాకు తెలవదు. ఈమాటు నువ్వెవ్వూరూ వెళ్లేవద్దూ. అంత తప్పక పోతే అన్ననాటికి—అన్నగడియకి తప్పకుండా రావాలి. ఆగడియకి సరిగ్గా యెదురుచూస్తూవుంటాను. క్షణం ఆలస్యంఅయినా నాకు మతిపోతుంది. ఈమాటు ఆల స్యంచేస్తే నేను వొప్పుకోను యేమనుకున్నావోను.

పేరుభట్టు— నువ్వలాపట్టుపడితే యెలాగా? పొరుగూరువెడితే అన్ననాటికి సరిగ్గా రావడం సాధ్యమా?

బంగారమ్మ—అయితే వెళ్లడానికి వల్లకాదు బాబూ!

పేరుభట్టు—డబ్బెలావస్తుందీ? డబ్బులేకపోతే కాలం యెలాగడుస్తుందీ?

బంగారమ్మ—కూచుంటుందికాలం. వున్నవాళ్లకీ వెడుతోంది, లేనివాళ్లకీ వెడుతోంది వొక్కమోస్త రుగా. అంతకావాలంటే యీవూళ్లో సంపాదించు కోరాదూ?

(అప్పుడు కాంతమ్మవస్తుంది.)

కాంతమ్మ—అదేమిటే వొళ్లోకూచున్నావూ? బావ యేమనుకుంటాడూ? రోజూ అదేపనా?

బంగారమ్మ—పదిమాట్లు కూచుంటాను రోజుకి. మనబావేకదూ? ఏంబావా! (చేతులు మెడకి పెన వేస్తుంది)

కాంతమ్మ—చెప్పినకొద్దీ మరీనీ. బావ నీకు పరికిణీ— తళతళమెరిసిపోతోంది, పట్టుదీ, జాకెట్టు కూడా తెచ్చాడు.

బంగారమ్మ—అవునా బావా? చెప్పావుకావేం? చీలిపిల్లాడా! (బుగ్గగిల్లి) ఇప్పుడు కట్టుకోనా బావా?

పేరుభట్టు—ఆలోచన యెందుకూ?

బంగారమ్మ—(లేచినుంచుని) ఇవ్వవే అమ్మా కట్టేసుకుంటాను. తొరగా యివ్వాలి. వాళ్లసూరమ్మ బువ్వాలాటకి పిలిచింది, అది కట్టుకునే వెడతాను. ఏంబావా! మంచిదే యివాళా? ఇవ్వవుటే అమ్మా?

పేరుభట్టు—ఎంతో మంచిదీ యిప్పుడు.

కాంతమ్మ—సంకురాత్రికి కట్టుకుందువుగాని లే దాచుకోమ్మా!

బంగారమ్మ—ఉహుఊ! చూశావా బావా మాఅమ్మనీ?

పేరుభట్టు —కట్టుకోనియ్యవమ్మా అత్తా! సంకు రాత్రికి ఇదే వుండాలాయేమిటి?

బంగారమ్మ—మరే. ఊరికే, మాఅమ్మ యెప్పుడూ యింతే. ఇవ్వవుటేఅమ్మా? బావ సరదాపడి కుట్టించుక వస్తే నువ్వు దాస్తావా?

కాంతమ్మ—పండుగునాడు కట్టుకుందువుగాని లేవే అంటే క్షణం వుండనంటావు. అప్పుడేంచేస్తావూ? నాకేం? కట్టుకోపోనీ. రామరీ! (వెడుతుంది.)

బంగారమ్మ— కట్టుకువస్తానుండేం బావా! (తల్లితో వెడుతుంది.)

పేరుభట్టు—(స్వగతం) ఇదీమచ్చు. ఏమిటి చెయ్యడం? మనస్సు తిప్పేసుకోవాలంటే ప్రాణపోక డగావుంది. తిరగడమే లేదూ.

(తెరలో)

ఇంతసేపా పసుపుపెట్టడం. తొరగా.

పేరుభట్టు—(స్వగతం) ఏంవుబలాటమూ? అతి చురుకూ. సిసింద్రీ.

(తెరలో)

జాకెట్టు సరిగ్గా తొడుక్కోకుండానే? అప్పుడే పరుగే?

పేరుభట్టు—(స్వగతం) వచ్చేస్తోంది. గంగా ప్రవాహంలాగ వురకలు వేసుకుంటూ వస్తోంది. అదిగో: మీదపడిపోతుంది. (చేతులుచాపి వుంచుతాడు. బంగారమ్మ గభీమనివచ్చి ఆచేతుల్లో యిరికి చుట్టపెట్టుకుంటుంది.)

కాంతమ్మ—(వస్తూ) అయితే: బంగారం! బావ పరికిణీ, జాకెట్టూ తెస్తే దుడుగూదుకుగూ కట్టుకోవడమేనా, దణ్ణంపెట్టడంవుందా?

బంగారమ్మ—అవును. మరిచిపోయాను. గట్టిగా పట్టుకో బావా!

పేరుభట్టు—పట్టుకున్నాను.

బంగారమ్మ—ఇదిగో దణ్ణం.

పేరుభట్టు—మరి మీఅమ్మకో?

బంగారమ్మ—విడిచిపెట్టు. (తల్లిదగ్గిరికివెళ్ళి) కాళ్లివ్వవే అమ్మా! (పాదాభివందనంచేస్తుంది.)

కాంతమ్మ—(బాష్పపూర్ణ నేత్రరై) మీనాన్న కంటె యెక్కువగా చూస్తున్నాడుబావ. ఇలాగేనా పెట్టిపుట్టావు.

పేరుభట్టు—ఏంవుందిఅత్తా? పదిమాట్లు యెందుకంటావూ అలాగా?

కాంతమ్మ—లేకేంనాయనా? ఇప్పటికి వంద రూపాయలేనా ఖర్చుపెట్టివుంటావు బంగారంకోసం.

పేరుభట్టు—ఒకటి చేస్తే వందంటావు.

బంగారమ్మ—వందరూపాయలే? అవునాబావా! అయితే నాకొద్దీపరికిణీ, జాకెట్టూనూ. వందరూపాయలా? బాబోయ్! ఇంకా యేమిటో అనుకున్నాను నేను. ఇంకెప్పుడూ తీసుకురాకు బావా యిలాంటివి. (జాకెట్టు విప్పబోతుంది.)

పేరుభట్టు—విప్పేస్తావా యేమిటి? మంచిదానవే. చాల్లే.

కాంతమ్మ—ఇంకెందుకూ తీరాకట్టుకున్నాకా?

బంగారమ్మ—వందరూపాయలు. మా నాన్న నాకిచ్చినవి సరిగ్గా వందరూపాయలున్నాయి. అవి యిచ్చేస్తాను పుచ్చుకో బావా!

పేరుభట్టు—(మూతిముడుచుకొని) ఇచ్చెయ్యి. నేను వెళ్లిపోతానమ్మా!

బంగారమ్మ—చూశావా? అదేమిటి బావా?

పేరుభట్టు—నా రూపాయలు నాకిచ్చెయ్యి. ఒక్క క్షణమేనా వుండనింక. తొరగా తేవాలి.

బంగారమ్మ—కోపం వచ్చిందా? విప్పేయ్యను లే బావా! మరి యింతసొమ్ము నాకోసం ఖర్చుపెట్టకేం యింకా?

పేరుభట్టు—ఏమో. నాడబ్బు నాకిచ్చెయ్యి. నువ్వు మంచిదానవు కావు.

బంగారమ్మ—నువ్వు మంచివాడవు కావా యేమిటి?

పేరుభట్టు—నే నేంచేశానేమిటి?

బంగారమ్మ—నాతో సరిగ్గా నువ్వుకూడా పట్టుపడతావా?

పేరుభట్టు—(స్వగతం) ఇంకేంచెప్పనూ?

కాంతమ్మ—(ముందుకుచూసి) ఎవరువారు పేరుభట్టూ? రత్తమ్మవొదిన కాదుగదా?

పేరుభట్టు—(చూసి) అవును. అడిగో రాయడు కూడా వస్తున్నాడు.

బంగారమ్మ—(చూడబోతుంది.)

కాంతమ్మ—(చూడకుండా వెనక్కితీసి) ఇంటోకిరా. పరికిణీ, జాకెట్టూ విప్పెయ్యి తొరగాను. (లోపలికి తీసుకుపోతుంది.)

పేరుభట్టు—(స్వగతం) ఎంచేతా? రత్తమ్మ పిన్నినీ, రాయణ్ణీచూసి అలాఅందేం అత్తా?

(రత్తమ్మా, రాయడూ వస్తారు)

రాయడు—ఇడుగో. అన్నయ్య యిక్కడే వున్నాడు.

రత్తమ్మ—ఎప్పుడు వచ్చావు—అన్నట్టిక్కడే వుంటున్నావుకామా? కాంతమ్మా, బంగారం కులాసాగావున్నారా నాయనా?

పేరుభట్టు—ఆ. ఇంటిదగ్గిరనుంచేనా రావడం? వెంకయ్యబాబు కులాసాగా తిరుగుతున్నాడా?

రత్తమ్మ—ఏంతిరగడం?

రాయడు—ఇంటో వొకళ్లసాయం అక్కర్లేదు. వీధిలోకివెళ్ల లేడు.

పేరుభట్టు—అలాగా?......లోపలికి పదండి. నేను భోజనంచేసివస్తాను.

రాయడు—భోజనంయెక్కడ అన్నయ్యా?

రత్తమ్మ—ఇక్కడ కాదుట్రా?

పేరుభట్టు—వారాలు చేసుకుంటున్నాను పిన్నీ!

రాయడు—(ఉత్సాహం కనపరుస్తాడు.)

రత్తమ్మ—అలాగట్రా? మరివెళ్లిరా, పాపం, అక్కడ కనిపెట్టుకుంటారో యేమిటోను.

పేరుభట్టు—ఇదిగో, వెడుతున్నాను. (వీధిలోకివచ్చి) ఇప్పుడెందుకువచ్చారూ వీళ్లూ? బంగారం కోసమేనా?......నా అదృష్టం యెలావుందో? (వెళ్లి పోతాడు.)

రత్తమ్మ—భయంలేదురా!

రాయడు—నేనుచెప్ప లేదూ? ఈమాటుధైర్యంగా వుందా? మొగదిక్కు లేకపోవడంవల్ల, వూళ్లోవున్నాడు గదాఅని రానిస్తోంది. అన్నంపెడుతుందీ వీడికి అత్తా?

రత్తమ్మ—ఏమీభయంలేదు.

రాయడు—బంగారం దాటిపోదే. చూస్తూ వుండు.

రత్తమ్మ—అయితే నువ్వా అదృష్టవంతుడవే, నేనూ అదృష్టవంతురాలినే. అత్త బంగారాన్ని నీకిచ్చిందంటే వెయ్యిరూపాయలు నగలుపెడతాను.

రాయడు— పెట్టాలి. ఈసంగతి తెలిసిందంటే యివాళే నిశ్చయంచేస్తుందిఅత్త...కాని డబ్బెలావస్తుందీ?

రత్తమ్మ—ఎకరంభూమి తెగనమ్మితే నగలూ వస్తాయి, పెళ్లీఅయిపోతుంది.

రాయడు—అవును. వుద్యోగం అయిందంటే ఆరుమాసాల్లో కొనేస్తాను ఆయకరమూనూ. అసలు సంవత్సరంలోపున సొమ్మిస్తే మళ్లీమనభూమి మనకిచ్చీలాగే మాట్లాడదాం.

రత్తమ్మ—అట్నుంచి నరుక్కువద్దాం. ఇంటోకి పద. (ముందుకి అడుగువేస్తుంది.)

రాయడు—నాకు నెల్లాళ్లలో యాభైఅరవై రూపాయల వుద్యోగం అవుతుందని చెప్పాలిసుమా. మరిచిపోకు.

రత్తమ్మ—నేనెరగనూ?

(ఇద్దరూ యింటోకివెడతారు.)